క్లుప్తంగా

ఉగాది డైరీ ఆవిష్కరణ



దేవరుప్పుల : చండీపరమేశ్వరీ పీఠం వ్యవస్థాపకుడు, సిద్ధాంతి డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ గణించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగం డైరీని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సీఎం ఓ కార్యాలయంలో తెలంగాణ దేవాదాయ శాఖ అర్చకులు, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీ ఆర్.శర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా



జనగామ: జిల్లా కేంద్రంలో మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో బుధవారం స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. జనగామలో ఈ రెండు పోలీస్‌స్టేషన్లు అత్యవసరమన్నా రు. జనగామ సబ్ జైలులో 40 మంది ఉంటే 23 మంది పంటలు ఎండిపోయాయని వీడియోల్లో మాట్లాడిన రైతులే ఉన్నారన్నారు. కాంగ్రెస్ నిరంకుశపాలనకు ఇదే నిదర్శనమన్నారు.

అండర్‌పాస్ కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

● సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద బైపాస్‌రోడ్డులో అండర్‌పాస్ నిర్మాణం కోసం చేపడుతున్న పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బూడిద గోపి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో అండర్‌పాస్ నిర్మించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 62వ రోజుకు చేరుకున్నా అధికారులు స్పందించకపోవడం సరైందికాదన్నారు. ఈ విషయమై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా వినతిపత్రం ఇచ్చామన్నారు. అండర్‌పాస్ నిర్మించకుంటే బైపాస్ రోడ్డు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అహల్య, రమేష్, బొట్ల శేఖర్, ప్రకాశ్, చందు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌పై చర్య తీసుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: గడువు తేదీ ముగిసిన ఫుడ్ ప్యాకెట్లను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న జిల్లా కేంద్రంలోని మోర్ సూపర్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సూపర్‌మార్కెట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం చీటకోడూరుకు చెందిన బండారి లక్ష్మణ్ మోర్ సూపర్ మార్కెట్లో యోగాబార్ ఫ్రూట్స్ అండ్ నట్స్ ఫుడ్ ప్యాకెట్‌ను పిల్లలకోసం తీసుకెళ్లగా అవి తిన్న వారు అనారోగ్యానికి గురయ్యారన్నారు. ప్యాకెట్‌పై మార్చి 19వ తేదీ ఎక్స్‌పైరీ డేట్ ఉందని సిబ్బందిని నిలదీస్తే పొంతనలేని సమాధానం చెప్పారన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సూపర్‌మార్కెట్లపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. విషయాన్ని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ దృష్టికి ఫోను ద్వారా సమాచారం అందజేయగా ఆయన స్పందించి మున్సిపల్ కమిషనర్ వెంకటేశంకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు మోర్ సూపర్ మార్కెట్‌ను మూసివేసి మున్సిపల్ సిబ్బందికి తాళాలు అప్పగించారు. చందు నాయక్, పట్టణ కమిటీ సభ్యులు శ్రావణ్, శ్రీకాంత్, ప్రశాంత్, మహేందర్, సంపత్ పాల్గొన్నారు.

తమ్మడపల్లి (ఐ)లో చోరీ

జఫర్‌గఢ్: అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడిన సంఘటన తమ్మడపల్లి (ఐ) గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుల్లె కుమారస్వామి గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి గ్రామ శివారులోని గొర్రెల మంద వద్దకు కాపరిగా వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి నిద్రపోయారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాన్ని తీసి బీరువా పగులగొట్టి అందులోని 14.5 గ్రాముల బంగారు గొలుసు, 24 తులాల వెండి, రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు బుధవారం తెల్లవారుజామున గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రాలు

● నిధులు లేక నిలిచిన నిర్మాణాలు
● పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు



స్లాబ్ పోసి వదిలేసిన బచ్చన్నపేట-2 ఆరోగ్య ఉపకేంద్రం



ఇందిరానగర్‌లో పిల్లర్ల వరకే నిర్మించిన ఉపకేంద్రం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని గ్రామాలకు ఆరోగ్య ఉప కేంద్రాలను మంజూరు చేసింది. పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి, కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ వారు చూపించిన స్థలాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను చేపట్టారు. ఈ ఉప కేంద్రాలు మంజూరు అయినా కాంట్రాక్టర్ ఎన్‌హెచ్ఎం నిధుల వరకే నిర్మాణాలను చేపట్టి పలు దశల్లో వాటిని వదిలేశారు. మండలంలోని కొన్నె, కట్కూర్, బచ్చన్నపేట-1(బురుజు గడివద్ద) బచ్చన్నపేట-2 (ఇందిరానగర్‌లో) ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించారు. ఇందిరానగర్, కొన్నెలలో పిల్లర్ల వద్దే నిర్మాణం ఆగగా, కట్కూర్, బచ్చన్నపేట-1లకు స్లాబ్ పోసి వదిలేశారు. అలాగే మండలంలోని పడమటికేశ్వాపూర్, తమ్మడపల్లి గ్రామాలకు కూడా ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు అయినా ఇంత వరకూ నిర్మాణ పనులను చేపట్టలేదు. ఆరు నెలలుగా ఉపకేంద్రాల పనులు నిలిచిపోయాయని సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వాటి నిర్మాణాలకు నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



మా గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే అన్ని వైద్య సేవలు ఇక్కడే పొందవచ్చు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

-చింతల బాలయ్య, కట్కూర్

నిధులు రాగానే పనులు పూర్తిచేస్తాం..



మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో నిధులు ఉన్నంత వరకే కాంట్రాక్టర్లు ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. మిగతా పనులకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అవి రాగానే నిర్మాణ పనులు పూర్తి చేసి ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- స్రుజన, మండల వైద్యాధికారి, బచ్చన్నపేట

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న ఉడుముల బాల

● బిషప్ ఉడుముల బాల

స్టేషన్‌ఘన్‌పూర్: లోక రక్షకుడైన యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని వరంగల్ మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బిషప్‌గా పనిచేసి పదోన్నతిపై విశాఖపట్నం అగ్ర పీఠాధిపతిగా వెళ్తున్న ఉడుముల బాలకు ఆయన స్వగ్రామమైన మండలంలోని సముద్రాల గ్రామశివారు గుంటూరుపల్లి చర్చిలో బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుంటూరుపల్లి చర్చి పెద్దలు మాట్లాడుతూ బిషప్‌గా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం బిషప్ మాట్లాడుతూ ప్రపంచమానవాళి సంక్షేమం కోసం లోకరక్షకుడైన యేసుక్రీస్తు పనిచేశారని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. గోపు జేమ్స్ రెడ్డి, రత్నారెడ్డి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వట్టి రాజిరెడ్డి, ఉడుముల థామస్‌రెడ్డి, గోపు ఫ్రాంచెస్‌రెడ్డి, గాదె ప్రతాప్‌రెడ్డి, సాల్మన్‌రెడ్డి, రాయపురెడ్డి, సుందర్‌రెడ్డి, మర్రెడ్డి, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



మంత్రితో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: కొడకండ్ల వ్యవసాయ మార్కెట్‌ను కొనుగోలు మార్కెట్‌గా తీర్చిదిద్దాలనే రైతుల సంకల్పానికి అనుగుణంగా మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బుధవారం కలిసి కోరారు. మార్కెట్ అభివృద్ధి కోసం పాలకవర్గం తీర్మానం, ప్రణాళికను మంత్రికి ఎమ్మెల్యే అందించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆమె వెంట కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు శ్రీరాములు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషించాలి



కొడకండ్ల: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధిలో మహిళా నాయకులు కీలక భూమికను పోషించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శ్రీవర్ధ అధ్యక్షతన నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో మహిళలు ఇంకా ముందంజలో నిలవాలని కోరారు. సమావేశంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, సురేష్‌నాయక్, అన్ని గ్రామాల మహిళా నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో భాగస్వాములను చేయాలి

దేవరుప్పుల: కుటుంబ నిర్వహణపై పట్టున్న మహిళలు సమాజ అభ్యున్నతి కోసం పాటుపడాలన్నా రాజకీయాల్లో భాగస్వాములను చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల మహిళా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో దిశ నిర్దేశం చేస్తూ పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని పలు మృతుల కుటుంబాలను ఆమె పరామర్శించి సాయం అందజేశారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వడ్లకొండ తార, మండల మహిళ అధ్యక్షురాలు మాలతి రెడ్డి, భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై ఎక్సైజ్ దాడులు

పాలకుర్తి: మల్లంపల్లి గ్రామం శివారు దుబ్బతండాలో గుడుంబా స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పక్కా సమాచారంతో దుబ్బతండాలో గుడుంబా తయారు చేస్తున్న గుగులోత్ విజయ ఇంటిపై దాడి చేశామన్నారు. దాడుల్లో 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

● సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రకాశ్

జనగామ రూరల్: పట్టణంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇవ్వలేదని.. అదే పద్ధతిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం దారుణమన్నారు. ప్రజా సమస్య పరిష్కష్కారం కోసం గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ సభ్యులు బాల్నె వెంకట మల్లయ్య, బూడిద ప్రశాంత్, మంగ వీరయ్య, గుండె మల్లేష్, ఆనందం, మల్లేష్ రాజ్, ఎల్లయ్య, జయ, భిక్షపతి పాల్గొన్నారు.

అవినీతి అధికారులను పట్టిచ్చిన వారికి ప్రోత్సాహకాలు

చిల్పూరు: అవినీతి అధికారులను పట్టించిన వారికి ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, జ్వాలా అవినీతి వ్యతిరేక సంస్థ ప్రకటించింది. మండలంలోని వెంకటేశ్వపల్లికి చెందిన బట్టమేకల శివరాజ్‌యాదవ్ ఇటీవల తన ఇద్దరు కుమారులకు ఇంటిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు స్టేషన్ ఘన్‌పూర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. అందుకు రూ.20 వేలు లంచాన్ని రిజిస్ట్రార్ రామకృష్ణ అడగండతో ఏసీబీని ఆశ్రయించగా వారు అతన్ని పట్టుకున్నారు. అందుకు గాను బుధవారం హైదరాబాద్‌లో శివరాజ్‌ను సంస్థ వారు సన్మానంతో పాటు రూ. 5వేల ప్రోత్సాహకం అందజేశారు.

స్వయంపరిపాలన దినోత్సవం



పాలకుర్తి: లక్ష్మీనారాయణపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

పాలకుర్తి: వావిలాల గ్రామంలో సర్వే నంబర్ 772లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వావిలాల భూ సంరక్షణ సమితి సభ్యులు అనపర్తి కిరణ్, అనపర్తి శ్రీను, అనపర్తి శ్రీను కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆర్డీఓకు ఆక్రమణలపై చర్య తీసుకోవాలని వినతి పత్రాలు అందజేశామని తెలిపారు.

స్వీయ అభ్యసనతోనే ఉజ్వల భవిష్యత్



చర్చా వేదికలో పాల్గొన్న విద్యార్థులు

దేవరుప్పుల: అరచేతిలో ప్రపంచాన్ని చూపించే స్థాయికి ఎదిగిన సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలన్నా ప్రతి విద్యార్థి స్వీయ అభ్యసన సాధనతోనే వారికి ఉజ్వల భవిష్యత్ లభ్యమవుతుందని ఫాదర్ థామస్ కిరణ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షతన స్కూల్ అవార్డు మార్నింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మక విద్యతోనే సృజనాత్మక ఆలోచనలతో కూడిన ఆవిష్కరణల వైపు దృష్టి సారిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై చర్చా వేదిక నిర్వహించి తమ ప్రతిభను కనపర్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగం విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే ఇంటర్నేషనల్ మ్యాథ్స్, సోషల్ ఒలింపియాడ్, యూనిఫైడ్ కౌన్సిల్ మ్యాథ్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వచ్చిన గోల్డ్‌మెడల్స్‌ను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు పలు సామాజిక విభాగాల సాంస్కృతిక ప్రదర్శనలు, ఎన్‌సీసీ, ఒలింపియాడ్స్ విద్యార్థుల ప్రత్యేక ప్రదర్శనలు అలరించాయి.

కూలీల హాజరు పెంచాలి



ప్రథమ చికిత్స కిట్లను అందిస్తున్న నాగశేషాద్రిసూరి

కొడకండ్ల: ఉపాధి హామీ పనులకు ప్రతి గ్రామం నుంచి 100 మంది కూలీలు పాల్గొనేలా కూలీల హాజరును పెంచాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు, కూలీలకు నీడ, తాగునీటి వసతిని కల్పించాలన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు మెటీరియల్ పేమెంట్లు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్ల యాజమానులు ప్రభుత్వం కల్పించిన రాయతీని సద్వినియోగం చేసుకుంటు పేమెంట్లు చెల్లించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ దామోదర్‌రెడ్డి

జనగామ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని సీఐ దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ పక్కన, అలాగే నెహ్రూ పార్క్ వద్ద జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ వ్యవస్థాపకుడు దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. సొసైటీ సభ్యులు పానుగంటి ప్రవీణ్, రాజు కుమార్, గన్ను కార్తీక్, కౌశిక్, విజయ్, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న పాస్టర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు కె.దేవవరం, కార్యదర్శి టి.ప్రవీణ్‌కుమార్, అడ్వైజర్ కేసీ జాన్‌బన్నీ డిమాండ్ చేశారు. రాజమండ్రి వద్ద పాస్టర్ ప్రవీణ్‌కుమార్ అనుమానస్పదంగా మృతిచెందగా మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో బుధవారం సంతాప ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక బస్టాండ్ సమీపాన అంబేడ్కర్ సెంటర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా క్రీస్తు బోధకులుగా పేరొందిన ప్రవీణ్‌కుమార్ మృతి బాధాకరమన్నారు. సంఘం జాయింట్ సెక్రటరీ కే.జాన్, కోశాధికారి కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎన్.టిక్నా, బి.సహోదర్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



జగదీష్‌చందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఇందిర

రఘునాథపల్లి: మండలంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుల కుటుంబాలను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర బుధవారం పరామర్శించారు. ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ లింగాల నరసింహారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా పార్టీ కార్యకర్తలతో ఇందిర మృతుడి కుమారులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, సతీష్‌చందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రఘునాథపల్లిలో మృతి చెందిన కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబుతో కలిసి పరామర్శించారు. నిడిగొండలో కాంగ్రెస్ నాయకుడు లింగాల జోగారెడ్డి, శ్రీమన్నారాయణపురంలో మాజీ సర్పంచ్ గొల్లూరి ఐలయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మేకల నరేందర్, ఎండీ బాషమియా, భాస్కర్‌రెడ్డి, కృష్ణ, మల్లేష్, కొమురెల్లి, పేర్ని రవి, కరుణాకర్‌రెడ్డి, ఎండి షబ్బీర్ ఉన్నారు.

ఉప్పుగల్లులో మాజీ ఎమ్మెల్యే రమేశ్..

జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామానికి చెందిన గాదెపాక సాయమ్మ మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ బృందంతో కలిసి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సాయమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కొరుకొప్పుల నాగేష్‌గౌడ్, గద్దం రాజు తదితరులు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన రాపాక సాయమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన జింక రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, గ్రామ అధ్యక్షుడు యాదగిరిలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రూ. 5 వేలు దహన సంస్కారాలకు, రూ.10 వేలు దశదిన కర్మ కోసం పంపగా బుధవారం నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మామిడాల లింగారెడ్డి, ఇల్లందుల విజయ్, తాళ్లపల్లి బుచ్చయ్య, బాబు, రాజు, చంద్రయ్య ఉన్నారు.

గీత కార్మికుని కుటుంబానికి..



శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నరేశ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. కాగా, గద్దం రాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణ సాయంగా రూ. 25 వేలు, రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా బాధిత కుటుంబానికి అందజేయాలన్నారు. అలాగే గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులు అందివ్వాలని కోరారు. కొయ్యడ రాందాసు, శ్రీపతిగోపి, యాదగిరి, వెంకటయ్య, రమేష్, చంద్రమౌళి, సాంబరాజు ఉన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో సీఐ పరిశీలన

స్టేషన్‌ఘన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని స్టేషన్ ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్, శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సీఐ జి.వేణు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్లలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం సెంటర్ల ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలి




దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలని ఎంఈఓ జి కళావతి సూచించారు. బుధవారం మాధాపురం ప్రాథమిక పాఠశాలకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత వినయ్ తల్లి పద్మజాదేవి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను హెచ్ఎం నల్ల లలితతో కలిసి ఆమె ప్రారంభించారు. కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ ఎం విష్ణు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి బాలుడి మృతి

పాలకుర్తి: బైక్ అదుపుతప్పి బాలుడు మృతి చెందిన ఘటన కొండాపురం దుర్గమ్మ గుడివద్ద చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపురం గ్రామానికి చెందిన ధరావత్ దేవేందర్(16) బైక్‌పై వెళ్తూ గ్రామంలోని దుర్గమ్మ గుడివద్ద అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవణ్‌కుమర్ తెలిపారు.


శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

నర్మెట: మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయకమిటీ భక్తుల సహకారంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టి ఇటీవల విగ్రహాల ప్రతిష్ఠ గావించారు. కాగా 41రోజులు పూర్తి కావడంతో వేదపండితుల సూచనలతో బుధవారం రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రసాదవితరణ కార్యక్రమాలను కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పురోహితులు పార్నంది శ్రీనివాస శర్మ, సతీష్ శర్మ, రక్షిత్ శర్మ పూజాది క్రతువులు నిర్వహించగా ఆలయకమిటి చైర్మన్ గంగం నర్సింహారెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వీఓఏలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమరవాణాపై అవగాహన కల్పించారు. బుధవారం క్రాంతి, స్ఫూర్తి, శ్రీనిధి, ప్రణీత, వనిత గ్రామైఖ్య సంఘాల వీఓఏలు మినుముల పద్మావతి, ఎండీ షరీఫా, కోళ్ల కీర్తన, అడ్డూరి లక్ష్మి, కడారి శశికళలు విద్యార్థులకు లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత, అక్రమ రవాణాను అరికట్టడంలో అనుచరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దర్దేపల్లిలో క్షుద్ర పూజల కలకలం

పాలకుర్తి టౌన్: దర్దేపల్లి గ్రామ శివారులో క్షుద్ర పూజలు ప్రజలను ఆందోళనకు గురి చేశాయి. గ్రామ శివారులోని వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. ఆ ప్రదేశంలో మహిళ బొమ్మతో ముగ్గు వేసి నిమ్మకాయలు వేసి పసుపు, కుంకుమ పోశారు. మరో పక్క నల్ల కోడిని కోసి చుట్టూరా పెట్టారు. కల్లుతో కూడిన ఓ కుండ అక్క డ ఉంది. కాగా, వీటన్నింటిని ఉపయోగించి క్షుద్ర పూజలు చేసినట్లు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. అటుగా వెళ్తున్న స్థానికులు అరుపులు విని అక్కడికి వెళ్లగా పూజలు చేస్తున్న వారు పరారయ్యారు. ఈ క్షుద్ర పూజలు చేతబడినా, బాణామతా లేక గుప్త నిధుల కోసమా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, దర్దేపల్లి గ్రామానికి చెందిన కొందరు క్షుద్ర పూజలు చేశారని గ్రామస్తులు భావిస్తున్నారు. పోలీసులు కూడా ఘటన స్థలిని సందర్శించినట్లు సమాచారం.